
**సౌశీల్య రామాపురం వెళదామని బస్సు స్టేషన్‌లో బస్సు కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. కొంచెం దూరంలో శ్రావ్యమైన కంఠంతో నగుమోమూ... అనే పాట పాడుతున్నారెవరో! ఆ స్త్రీ కంఠం తానెక్కడో విన్నట్లు మనసు చెబుతున్నది. జనం ఆమె చుట్టూ మూగి ఉండటంచేత ఆమె రూపం తెలియటంలేదు. అక్కడున్న ఎవరో ఆమెతో**

# శరత్సంధ్య

మాపాటి సౌభాగ్యలక్ష్మి



"ఇదిగో ఈ అరటిపండు తిని "కొండలలో నెలకొన్న" అనే పాట పాడు? అన్నాడు ఓ వ్యక్తి.

ఈసారి సౌశీల్యకు "కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు" అనే పాట వినిపిస్తున్నది. సౌశీల్యకు తాను కూడా వెళ్ళి ఆ పాట పాడే ఆమెను చూడాలనిపించింది. కాని తాను లెక్చరర్‌గా పని చేస్తున్నది. ఎవరైనా స్టూడెంట్స్ చూస్తే బాగుండదేమో అనుకుంది. కాని మనసు ఆగలేదు. ఆ పాడే ఆమె వద్దకు వెళ్ళింది. జనం చుట్టూ మూగి ఉండటంచేత ఆ జనాలను తోసుకుంటూ పాట పాడే ఆమెను చూసింది. అంతే! షాక్ తిన్నంత పనయింది.

రమ్య!

చాలా రోజుల తరువాత తన స్నేహితురాలిని ఈ స్థితిలో చూస్తున్నందుకు ఎంతో బాధ పడింది. ఇప్పుడు తానేమి చెయ్యాలి?

ఆమెను తన ఇంటికి తీసుకువెళితే, భర్త ఏమన్నా అంటాడేమో! తనకు ఈ మధ్యేవివాహమయ్యింది. ఇంకా ఒకరిని ఒకరు పూర్తిగా అర్థం చేసుకోనేలేదు. కాని రమ్యను ఈ స్థితిలో వదిలివేయటం మానవత్వం అనిపించుకోదేమో! తొందరపాటు నిర్ణయాలు తీసుకొంటే ఫలితం ఒక్కోసారి దారుణంగా ఉండవచ్చు. తాను ఉద్యోగం చేస్తున్నది. ఈ పిచ్చిదాన్ని ఇంటికి తీసుకెళ్ళి వైద్యం చేయించే స్తోమత ఉంది. కాని తాను కాలేజీకి వెళ్ళాక ఎవరు చూస్తారు? "లేనిపోని దుఃఖం తెచ్చిపెట్టుకోవటం అవుతుందేమో ఆలోచించు" అని మనసు హెచ్చరించింది.

పేద కుటుంబం నుంచి వచ్చిన తనను ఎన్నోసార్లు రమ్య ఆర్థికంగా ఆదుకుంది. పుస్తకాలు నోట్సులు కొని ఇచ్చింది. ఆ విశ్వాసం కొద్దిగా అయినా తనకు ఉండాలి కదా!

మనసు నిశ్చయం చేసుకుని ఆమె దగ్గరకు వెళ్ళి-

"రమ్యా రా! ఇక్కడెందుకున్నావు" అంటూ చేయి పట్టుకుని లేపింది.

"పిచ్చిదాన్ని ఇలా బస్ స్టాండులో వదిలేస్తారా ఇంట్లోంచి పారిపోగానే వెతుక్కుని తెచ్చుకోవద్దూ" మందలింపుగా ఓ పెద్ద మనిషి.

"చూస్తే డబ్బున్నవాళ్ళ లాగానే ఉన్నారు. ఆడ కూతురు పిచ్చిది. నడి రోడ్డు మీద వదులుకుంటారా" అని మరెవరో అంటున్న మాటలు సౌశీల్య చెవిలో పడ్డాయి. తనను కాదన్నట్లు వినిపించుకోకుండా గబగబా రిక్షా పిలిచి రమ్యను ఇంటికి తీసుకెళ్ళింది.

రమ్యకు మతి చలించిందని ఆమెను చూసిన వాళ్ళెవరైనా వెంటనే ఊహించగలరు. రమ్యకు ఎందుకు

మతి చెలించిందో తెలుసుకునే కంటె ఆమెకు వైద్యం చేయించి, మామూలు మనిషిగా అయ్యేలా చెయ్యటం ముఖ్యమనుకుంధి సౌశీల్య. స్నానాదులు చేయించి రమ్యను తనకు తెలిసిన డాక్టరు వద్దకు తీసుకెళ్ళింది. తన ఇంటి వద్ద రమ్య ట్రీట్‌మెంట్ పూర్తి చేసేలా డాక్టరుతో మాట్లాడుకుంది. ఇవన్నీ అయ్యేసరికి టైం ఐదు గంటలయ్యింది.

ఆఫీను నుంచి మోహనరావు ఇంటికి వచ్చాడు. ఊరు వెళతానని సౌశీల్య ఉదయం తనకు చెప్పింది. తన ఇంటి తలుపులు తీసి ఉన్నందుకు ఆశ్చర్యపోయాడు. డ్రస్ మార్చుకోవటానికి బెడ్ రూమ్‌కు అనుకుని రూమ్‌లోకి వెళ్ళేసరికి రమ్య కనిపించింది. మోహనరావు ఆశ్చర్యపోయాడు. "ఎంత అందమయిన అమ్మాయి!" అని మోహనరావు మనసులో అనుకుంటుండగా సౌశీల్య గబగబా లోపలికి వచ్చింది.

"ఎప్పుడు వచ్చారు?"

"ఇంతకీ ఈ అమ్మాయి ఎవరు?

"ఆ సంగతి తరువాత చెపుతాను. బయటికి రండి' అని సౌశీల్య మోహనరావును వంట గదిలోకి తీసుకెళ్ళి విషయం వివరించింది.

ఆ రోజు రాత్రి సౌశీల్య రమ్యవాళ్ళ అడ్రను కోసం వెతికింది. దొరికిన పాత అడ్రను తీసి భర్తకు ఇచ్చి రమ్య తల్లిదండ్రులకు వాళ్ళ కూతురు ఇక్కడుందని చెప్పి చెప్పమంది. మోహనరావు ఆ అడ్రస్సు వెతుకుంటూ వెళ్ళాడు. వాళ్ళు లేరని, రెండేళ్ళ క్రితమే ఆ ఊరు వదిలి వెళ్ళారని... కొత్త అడ్రను తెలియదని అక్కడివాళ్లు చెప్పారు.

"ఆమె పేరెంట్స్ అచూకీ దొరకలేదు కదూ, ఈ అమ్మాయిని పిచ్చాసుపత్రిలో చేర్చుదాం" అన్నాడు మోహనరావు భార్యతో. "ఆ అమ్మాయికి త్వరలోనే తగ్గుతుంది. ఏదో ప్రమాదం వల్ల సంగతులు మర్చిపోయింది" అని డాక్టరుగారు అన్నారు. అయినా అది ఏమీ అల్లరి చేయటంలేదు. అప్పుడప్పుడూ పాటలు పాడుతుందంతే. ఎవర్నీ కొట్టటంలేదు గదా. మన దగ్గరే ఉంచుకొని కాస్త తగ్గగానే పంపుదామండీ" అంది సౌశీల్య.

భర్తను ఎట్లాగో మెప్పించి రమ్యను తాను లేనప్పుడు చూసుకోవటానికి మనిషిని ఏర్పాటు చేసింది. మూడు నెలలు తిరిగాయి. ఓ రోజు సౌశీల్య ఒంట్లో బాగోకపోవటం వల్ల తిరుగు బస్సులో ఇల్లు చేరుకుంది. అప్పుడు రమ్య రూమ్‌లోంచి మోహనరావు బయటకు వస్తున్నాడు. సౌశీల్య నిర్ఘాంతపోయింది. అయినా తొందరపడకూడదని తమాయించుకుంది. కారణం లేకుండా ఆ రూములోకి వెళ్ళి ఉండడు కదా అని సరిపెట్టుకుంది.

ఆ రోజు రమ్యను చెకప్ కోసం డాక్టరు దగ్గరికి తీసుకొని వెళ్ళింది. "ఆమెలో మార్పు కనిపిస్తున్నది. ఒకసారి లేడీ డాక్టరుతో చెకప్ చేయించమని' డాక్టరు సలహా ఇచ్చాడు. లేడీ డాక్టరుకు చూపిస్తే టెస్టుచేసి రమ్య గర్భిణీ అని, ఇప్పుడు మూడో నెల అని తేల్చి చెప్పింది.

సౌశీల్య తలపై పిడుగు పడినట్టయింది. తాను ఉదయం చూసిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. దీనికి కారణం తన భర్తే అనుకుంది. నిలదీసి అడిగితే? తనకేమీ తెలీదని బుకాయిస్తాడేమో? కాదని. తప్పు మోహనరావుదే! అని తాను రుజువు చెయ్యలేదు. ఆ



★ "డాక్టర్‌గారు నేను బాగా గుర్రు పెడ్తాను. ఒకసారి గది ప్రతిధ్వనించి నాకే మెలుకువ వస్తుంది. ఏం చేయను" అడిగాడు గుర్రురావు - "ఏముందయ్యా పక్క గదిలో పడుకో వినిపించదు" చెప్పాడు డాక్టరు పరధ్యానం.

రోజే అందమైన పిల్ల అని రమ్య అందాన్ని మెచ్చుకున్నాడు కదా? కాబట్టి రమ్యకు పుట్టబోయే బిడ్డకు తండ్రి కచ్చితంగా ఆయనే. ఇప్పుడు తను ఏమి చేయాలి?

ఇది తన సొంత సమస్య. ఎవరి సలహా తీసుకోకూడదు అనుకుంది సౌశీల్య. ఆమె మోహనరావుతో చాలా ముభావంగా ఉంటున్నది. ఒక రోజు అతను సౌశీల్యను పిలిచి "శీల్యా! మా ఆఫీసులో అందరూ నన్ను కొంటె మాటలు అంటున్నారు. కాముకులకు పిచ్చివాళ్ళు, మంచివాళ్ళు అనే తేడా ఉండదంటున్నారు. అంతా నాదే తప్పు అని. అందుకనే ఆ పిచ్చిదాన్ని మనింట్లో తెచ్చి ఉంచుకున్నామని అంటున్నారు. దీనికంతటికీ కారణం నువ్వు. పెళ్ళై ఏడాది కాలేదు. ఈ తలనెప్పి నాకెందుకు? ఇప్పుడే చెబుతున్నా ఈ ఇంట్లో రమ్య అయినా ఉండాలి, నేనయినా ఉండాలి. ఆ అమ్మాయిని పిచ్చాస్పత్రిలో చేర్చే ఏర్పాటు చేసి వచ్చాను. ఏమంటావ్" అన్నాడు మోహనరావు. సౌశీల్యకు ఒళ్ళు మండింది. "ఇంక ఊరుకోండి. ఆ పుట్టబోయే బిడ్డకు..." అంటూంటే మధ్యలోనే ఆపాడు మోహనరావు ధుమధుమలాడుతూ...

"చాలించు నీ మాటలు... నేనేది చెప్పినా ఎవ్వరూ అర్థం చేసుకోరు" అని గబగబా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి తలుపులు వేసేసుకున్నాడు.

అర్ధరాత్రి అయింది. సౌశీల్య ఏదో ఆలోచిస్తున్నది. రమ్య రూమ్‌లోంచి చిన్నగా మూలుగు వినిపిస్తున్నది. క్రమేణా ఆ మూలుగు పెద్దదయ్యింది. రమ్యకు నొప్పులు. వెంటనే తీసుకెళ్ళి హాస్పటల్‌లో చేర్పించింది. చక్కటి బాబు పుట్టాడు. డాక్టరు సౌశీల్యను పిలిచి "ఈ పేషంటు పరిస్థితి సీరియస్‌గా ఉంది... ఏదో మాట్లాడాలని అంటున్నది... "ఎక్కడున్నాను" అని అడిగితే "హాస్పటల్‌లో ఉన్నావు. నీకు బాబు పుట్టాడని" చెప్పాను. మీరు రండి... ఆమె ఎక్కువసేపు బ్రతకకపోవచ్చు" అని అన్నది.

"రమ్యకు తెలివి వచ్చిందా డాక్టర్! మామూలుగా మాట్లాడుతోందా!" అని హడావిడిగా మాట్లాడుతూ, సౌశీల్య రమ్య దగ్గరకు పరుగెత్తింది.

రమ్య ఆమెను చూస్తూ... "ఈ బాబు... ఈ బాబూ..." అని అంటూనే ప్రాణాలు వదిలింది.

ఇంటికి తీసుకువెళ్ళి శవం ముందు దిగాలుపడి కూర్చుంది సౌశీల్య... తాను చేయదలచింది ఒకటయితే - ఇంకొకటి జరిగింది... ఉపకారం చెయ్యబోయి తనే సమస్యల వలలో చిక్కుకుంది. దీనినుంచి ఎలా బయటపడాలి? భర్తనడిగితే పిల్లవాడిని అనాథ శరణాలయంలో చేర్చమంటాడు. తాను ఇష్టపడకపోతే గొడవ విడాకులదాకా పోతుంది. బాబును తీసుకొని తాను ఇంక ఒంటరిగా బ్రతకాల్సి వస్తుందేమో!

"సౌశీల్యా" అనే పిలుపుతో ఉలిక్కిపడి గుమ్మంవైపు చూసింది. తెల్లగా తెల్లవారింది.

గుమ్మం దగ్గరనుంచున్న రామారావును చూసి సౌశీల్య నోట మాట రాలేదు.

"నిన్ననే పేపరు ప్రకటనలో మా అమ్మాయి ఫోటోను చూశాను. అడ్రస్సు తెల్సుకొని వచ్చానమ్మా! మా అమ్మాయి, అల్లుడూ హనీమూన్ నుంచి మా ఇంటికి వస్తుంటే దారిలో యాక్సిడెంట్ అయ్యింది. అల్లుడు పోయాడు. రమ్యకు మతి చలించింది. దానిని హాస్పటల్‌లో చేర్పించి వైద్యం చేయిస్తుంటే తప్పించుకొని పారిపోయిందమ్మా! మీకెంతో రుణపడ్డాను. మా అమ్మాయిని మీరు కాపాడినందుకు" అని అంటూ లోపలికి వచ్చిన రమ్య తండ్రి రామారావు శవమై ఉన్న తన కూతుర్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. పక్కనే ఉన్న బాబును ఎత్తుకొని బాధపడ్డాడు. మిగతా కార్యక్రమాలు పూర్తి అయ్యాయి.

"సౌశీల్యా! స్నేహితురాలిపై ప్రేమతో దాన్ని దగ్గరకు తీశావు... దాని గుర్తుగా మిగిలిన ఈ బాబును నాకు మిగిలేలా చేశావు. నా ఆస్థిలో నీకు సగం ఇస్తానమ్మా!" అన్నాడు రామారావు. అంతలో అక్కడే ఉన్న సౌశీల్య భర్త మోహనరావు కల్పించుకుంటూ-

"రామారావుగారూ! మీ ఆస్థి మాకు అక్కరలేదు. అందరితో; ఆఖరికి నా భార్య సౌశీల్యతో కూడా అవమానాలు భరించాను. ఈ పొందిన అవమానాలు తిరిగి తీసుకోగలరా! అప్పుడు అవమానపు చూపుతో చూసిన ఈ జనం... సూటీపోటీ మాటల బాణాలు విసిరిన జనం ఇప్పుడు నన్ను మెచ్చుకుంటున్నది. ఏమైనా ఆదర్శాలు చెప్పటం తేలిక. ఆచరించటం ఎంత కష్టమో! వాంతి చేసుకొన్న మీ అమ్మాయిని బయటనుంచి తీసుకొచ్చి ఆమె బెడ్‌పై పడుకోబెట్టాను. మానవత్వంతోనే ఆ పని చేశాను తప్ప దాన్నే సౌశీల్య అపార్థం చేసుకొంది. కాని నేను ఏది చెప్పినా ఆమె నమ్మేలా లేదు. అప్పటి పరిస్థితి అదీ!... అని బాధపడసాగాడు మోహనరావు.

"నన్ను క్షమించండీ! మిమ్మల్ని అపార్థం చేసుకొన్నాను" అంది సౌశీల్య.

"క్షమించండీ! అని సినిమా డైలాగులంటే నాకు పరమ అసహ్యం. ఎదుటివారిని అనుమానించటం అవమానించటం తేలికే! కాలికంటిన బురద తుడుచుకోవచ్చు జరిగిన అవమానాలు మరవటం కష్టం" అన్నాడు మోహనరావు. .

"నిజమేనండీ. తప్పంతా నాదే. మీరేశిక్ష విధించినా సరే" అంది సౌశీల్య.

"స్నేహితురాలని నా కూతుర్ని నీ దగ్గర ఉంచుకున్నావు! వేరే వాళ్ళయితే ఉంచుకోగలవా! అమ్మా! ఏ పిచ్చి దాన్నయినా! పిచ్చివాడయినా కనీసపు జాలితో చూడగలిగే మనసు ఈ సమాజానికి రావాలని కోరుకుంటున్నానను!" అని అంటూ రామారావు మనవడిని తీసుకొని గడపదాటాడు. ★